## కరాటేలో గురుకుల విద్యార్థికి గోల్డ్ మెడల్




మణికంఠను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

తాండూరు రూరల్, జనవరి 10 : షాద్‌నగర్‌లో ఈ నెల ఏడో తేదిన జరిగిన ఓపెన్ నేషనల్ కరాటే పోటీల్లో అండర్–16 బాలుర విభాగంలో మహాత్మాజ్యోతి బాపూలే గురుకుల (బాలుర) పాఠశాల విద్యార్థి మణికంఠ గోల్డ్‌మెడల్ సాధించారు. వివిధ జిల్లాల నుంచి 100 మంది ఈ పోటీల్లో పాల్గొన్నట్లు పాఠశాల పీఈటీ సంగయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం మణికంఠను అభినందించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## నేడు పత్తి కొనుగోళ్లు నిలిపివేత

వికారాబాద్, జనవరి 10 : అమవాస్యను పురస్కరించుకొని గురువారం జిల్లాలోని పత్తి మిల్లుల్లో పత్తి కొనుగోళ్లు నిలిపివేసినట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి బుధవారం ఒక ప్రటనలో తెలిపారు. తిరిగి శుక్రవారం, శనివారం రెండు రోజులు సీసీఐ వారిచే జిల్లాలోని అన్నీ మిల్లుల్లో పత్తి కొనుగోలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని రైతులు గమనించి సహకరించాలని కోరారు.

## జాతీయ రహదారిపై డ్రైవర్ల ఆందోళన



జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న డ్రైవర్లు

బొంరాస్‌పేట, జనవరి 10 : కేంద్ర ప్రభుత్వం ఐపీసీ చట్టం స్థానంలో ఇటీవల తెచ్చిన న్యాయ సంహిత చట్టాన్ని నిరసిస్తూ బుధవారం బొంరాస్‌పేట మండలం తుంకిమెట్లలో హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ చట్టం ప్రకారం హిట్ అండ్ రన్ కేసులో డ్రైవర్లకు గరిష్ఠంగా పది ఏండ్లు జైలు శిక్ష, రూ.7 లక్షల జరిమానా విధించే అవకాశం ఉన్నది. ఈ చట్టం వల్ల లారీ, ట్రక్కు డ్రైవర్లు వీధుల పాలవుతారని లారీ డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. డ్రైవర్ల ఆందోళనతో జాతీయ రహదారిపై వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఎస్సై శంకర్ సిబ్బందితో వచ్చి డ్రైవర్ల ఆందోళనను విరమింపజేశారు. ఆందోళనలో లారీ డ్రైవర్ల సంఘం నాయకులు వెంకటయ్య, రాజు, అబ్దుల్లా, శ్రీనివాస్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

## రెండు స్కూటీలను ఢీకొన్న లారీ



స్కూటీలు, కారు, ప్రహరీని ఢీకొన్న లారీ

తాండూరు, జనవరి10 : రెండు స్కూటీలతో పాటు, కారును, ప్రహరీని లారీ ఢీకొన్న ఘటన బుధవారం ఉదయం తాండూరు పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తాండూరు నుంచి మహబూబ్‌నగర్‌కు సిమెంట్ లోడుతో లారీ వెళుతుంది. పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జ్‌దాటగానే అతివేగంతో అదుపుతప్పి ఆగి ఉన్న రెండు ద్విచక్ర వాహనాలతో పాటు సమీపంలోని కారును ఢీకొని దుకాణ నిర్మాణ ప్రహరీని ఢీకొట్టింది. కారులో కూర్చొన్న ఓ ప్రయాణికుడికి తీవ్రగాయాలు కాగా చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

## పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

తాండూరు రూరల్, జనవరి 10 : పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించి, ప్రతీ పాఠశాలలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మయ్య ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి పి.పురుషోత్తంరెడ్డి, కార్యర్గ సభ్యులు రవికుమార్, సుశీల, అనిల్‌కుమార్, బాలకృష్ణ, విజయ్‌కుమార్, నరేందర్, రాజేశ్వర్, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, రమేశ్, రమేశ్‌కుమార్, బాల్‌రాజ్, ప్రభు, భాను ప్రకాశ్, మనోహర్ ఉన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఉపాధ్యాయులు

# పతంగుల సంబురం

## కారాదు విషాదం

పిల్లలపై పెద్దల పర్యవేక్షణ ఉండాలి

మైదానాల్లో ఎగురవేస్తే సురక్షితం



బొంరాస్‌పేట, జనవరి 10 : సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు ఎక్కడ చూసినా పతంగుల సందడే కనిపిస్తుంది. వచ్చే శుక్రవారం నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు రావడంతో నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో గాలి పటాలు ఎగురవేసే దృశ్యాలు కనిపిస్తాయి. ఆకాశ వీధిలో రంగు రంగుల పతంగులు కనువిందు చేస్తుంటాయి. పిల్లలంతా ఒకచోట చేరి ఉత్సాహంగా పతంగులను ఎగురవేస్తుంటారు. ఇదంతా ఒకవైపు ఉంటే పండుగ వేళ ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వినోదం కాస్తా విషాదంగా మారే ప్రమాదం ఉంది. ముఖ్యంగా విద్యుత్ తీగలకు చిక్కుకున్న పతంగులను తీయబోయి విద్యుదాఘాతానికి గురవుతుంటారు. ఎత్తయిన భవనాల పైకి ఎక్కి కిందపడుతుంటారు. గతంలో ఇలాంటి సంఘటనలు జరిగి చిన్న పిల్లలు ప్రాణాలు కూడా పోగొట్టుకున్నారు. ఇలాంటి ఘటనలు కుటుంబాలలో విషాదం నింపుతాయి. అందుకే గాలిపటాలు ఎగురవేసే సమయంలో పిల్లలపై పెద్దల పర్యవేక్షణ తప్పక ఉండాలి.

**భవనాలపై వద్దు మైదానాలే మేలు..**

నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో పిల్లలు ఇళ్లపైన ఎక్కువగా పతంగులను ఎగురవేస్తుంటారు. పట్టణ ప్రాంతాలలో మైదానాలు దూరంగా ఉంటాయి కాబటి పిల్లలు భవనాలను ఎక్కి పతంగులు ఎగురవేస్తుంటారు. భవనాలకు పిట్ట గోడలు లేకపోవడం, ఉన్నా తక్కువ ఎత్తులో ఉండడంతో ఎగురవేసే ఆనందంలో ఇవేవి చూసుకోకుండా కిందపడే అవకాశం ఉంటుంది. కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకుని పతంగులను ఎగురవేయాలి.

- రహదారులపై ఎగురవేస్తూ వాహనాల కిందపడే ప్రమాదం ఉన్నది. రోడ్లు ఖాళీగా ఉన్నా సరే అక్కడ పతంగులను ఎగురవేయవద్దు.
- తెగిన గాలిపటం కోసం వెనుకా ముందు చూసుకోకుండా పరుగెత్త వద్దు. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నది.



## ఇలాగైతే సురక్షితం

పతంగులను ఆరు బయట, మైదాన ప్రాంతాల్లోనే ఎగురవేయాలి.

పిట్ట గోడల ఎత్తు ఎక్కువగా ఉన్న భవనాలపై ఎగురవేయవచ్చు. ఆ పిల్లలను పెద్దలు ఓ కంట కనిపెడుతూ ఉండాలి.

**విద్యుత్ కాటేస్తుంది జాగ్రత్త**

విద్యుత్ స్తంభాలకు ఇరుక్కున్న, తెగిన మాంజాలు, పతంగులను చేతితో, ఇనుప చువ్వలతో లాగవద్దు. విద్యుదాఘాతానికి గురయ్యే అవకాశం ఉంది.

విద్యుత్ తీగలపై పడిన దారాలు పట్టుకుని లాగొద్దు. ఇలా చేయడంతో విద్యుత్ సరఫరా జరుగుతున్న తీగలు ఒకదానికొకటి తాకి షార్ట్ సర్క్యూట్ అవుతుంది.

పతంగులు ఎగురవేసే ముందు మెటాలిక్ దారాలను ఎలాంటి పరిస్థితుల్లో ఉపయోగించవద్దు. విద్యుత్ తీగలకు తగిలినప్పుడు షాక్ కొట్టే అవకాశం ఉంది. లైన్లు సైతం తెగిపడే ప్రమాదం ఉంది. విద్యుత్ స్తంభాలు, తీగలు, చెట్లకు గాలి పటాలు తగిలి చిక్కుకుంటే వాటిని తీయడానికి ప్రయత్నించరాదు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నది.

పతంగి ఎగురవేయడానికి వినియోగించే నిషేధిత మాంజా ప్రమాదకరంగా మారుతుంది. ఎగురవేసే వారి చేతి వేళ్లు తెగుతుంటాయి. పైగా రహదారులపై వెళ్తున్న వారి మెడకు బిగుసుపోవడంతో గొంతు దగ్గర గాయాలయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి పతంగులకు నిషేధిత మాంజాను ఉపయోగించరాదు.

## సీఎంను కలిసిన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, నేవి కమెండో కార్తిక్‌శంకర్

పరిగి టౌన్, జనవరి 10 : పూడూరు మండల పరిధిలోని దామగుండం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న నేవి ప్రాజెక్టు పనుల ప్రారంభం విషయంలో బుధవారం ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, నేవి కమెండో కార్తిక్‌శంకర్ బృందం సభ్యులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. దేవాలయానికి ఎలాంటి నష్టం జరగకుండా నేవి ప్రాజెక్టు పనులను ఫిబ్రవరి మాసంలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తెలిపారు.

## పోరాటయోధుడు పండుగ సాయన్న

విగ్రహావిష్కరణ సభలో కాసాని వీరేశ్‌ముదిరాజ్



పండుగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కాసాని వీరేశ్‌ముదిరాజ్

కులకచర్ల, జనవరి 10 : పేదరికంతో అలమటిస్తున్న ప్రజల కోసం పోరాడి అన్నం పెట్టిన మహానుభావుడు పండుగ సాయన్న అని అఖిల భారత ముదిరాజ్ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి, పండుగ సాయన్న విగ్రహదాత కాసాని వీరేశ్ ముదిరాజ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఇప్పాయిపల్లి గ్రామంలో గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రాములు అధ్యక్షతన జరిగిన పండుగ సాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పండుగ సాయన్న ఆశయాలు గొప్పవన్నారు. అణగారిన వర్గాల అభివృద్ధి కోసం పోరాటం నిర్వహించిన గొప్ప యోధుడు పండుగ సాయన్న అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎల్ ఫ్యాక్టరీ ఎండీ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు చంద్రలింగం, ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలముకుందం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, ఇప్పాయిపల్లి సర్పంచ్ అనురాధబాల్‌రెడ్డి, ఎంపీటీసీ పద్మారఘుగౌడ్, చౌడాపూర్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కృష్ణ, ముదిరాజ్ సంఘం జిల్లా నాయకులు ధ్యానమోని శ్రీనివాస్, బాబయ్య, శ్రీశైలం, మధు, పి. అనంతయ్య, ఏబీబీఎస్ తాలుకా అధ్యక్షుడు రాహుల్‌నాయక్, నియోజకవర్గ అధ్యక్షుడు రామస్వామి, ఇప్పాయిపల్లి గ్రామ మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు గాదె రామయ్య, ఉపాధ్యక్షుడు వెన్నచేటి చిన్న చెంద్రయ్య, ప్రధాన కార్యదర్శి మొగులయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు గూళ్ల వెంకటయ్య, వెన్నచేటి నర్సింహులు, కామారం అంజిలయ్య, ఎల్లయ్య, వెన్నచేటి ఆంజనేయులు, బొవ్వని నర్సింహులు, రేణి వెంకటయ్య, కామారం రాములు, పినమోని నర్సింహులు, ధ్యానమోని రాములు పాల్గొన్నారు.

## కంది పంట దగ్ధం

మర్పల్లి : ప్రమాదవశాత్తు నిప్పంటుకుని కందిపంట దగ్ధమైంది. మండల కేంద్రానికి చెందిన బక్క పార్వతమ్మ తన పొలంలో కంది పంట వేసింది. బుధవారం మధ్యాహ్నం సమయంలో పొలంలో మంటల ఎగిసి పడుతుండటాన్ని చూసిన గ్రామస్తులు సమాచారం అందించడంతో వెళ్లి చూడగా అప్పటికే పంట కాలిపోయిందని, ప్రభుత్వం తమకు ఆర్థిక సాయం అందించాలని కోరారు.

## 'పది'లో మంచి ఫలితాలు సాధించాలి

కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి 10 : విద్యా ప్రమాణాలు మెరుగు పరచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మార్చిలో నిర్వహించే పదో తరగతి పబ్లిక్ పరీక్షలపై మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించి పరీక్షల్లో మంచి ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించాలన్నారు. గతంలో ఉత్తీర్ణత శాతం తక్కువ రావడానికి గల కారణాలు అన్వేషిస్తూ, ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు చొరవ చూపాలని కలెక్టర్ తెలిపారు. ఉపాధ్యాయుల కొరత ఉంటే సర్దుబాటు చేయాలని డీఈవో రేణుకాదేవికి సూచించారు. కార్యక్రమంలో డీసీఈబీ చైర్మన్ అనంతరెడ్డి, ఏసీజీఈ రాంరెడ్డి పాల్గొన్నారు.

**చెంచుల జీవనోపాధికి ప్రణాళికలు రూపొందించాలి..**

చెంచుల జీవనోపాధి కోసం ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. చెంచు కుటుంబాల అభివృద్ధికి, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 11 పనుల అమలు తీరుపై కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో గుర్తించిన చెంచులకు మెరుగైన జీవనోపాధికి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. ఆధార్‌కార్డు లేని వారికి వెంటనే ఎన్‌రోల్ చేయాలని, కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలన్నారు. 18 ఏండ్లు నిండిన వారి పేర్లను ఓటర్ జాబితాలో నమోదు చేసి, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కింద ప్రతి చెంచు కుటుంబానికి హెల్త్ కార్డులతో పాటు పీఎం జన్‌ధన్ పథకం కింద బ్యాంకు ఖాతాలతోపాటు పంట రుణాలు అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. అటవీ భూముల క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించాలన్నారు. నల్లా కనెక్షన్లు లేని వారిని గుర్తించి 'మిషన్ భగీరథ' నీటిని అందించాలన్నారు. రెండు రోజుల్లో పనులు పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 15న ప్రధానమంత్రి చెంచుల అభివృద్ధికి ఎంపికైన జిల్లాల అధికారులతో మాట్లాడనున్నారని, అధికారులు అందరూ పాల్గొనాలని తెలిపారు. సమావేశంలో వికారాబాద్, తాండూరు ఆర్డీవోలు, గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోఠాజీ, వ్యవసాయ శాఖ అధికారి గోపాల్, అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, వైద్యాధికారి పాల్వాన్ కుమార్, తహసీల్దార్లు , ఎంపీడీవోలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు

## ప్రమాద బీమాతో కుటుంబానికి భరోసా

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సునీల్ కుమార్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సునీల్ కుమార్

యాలాల, జనవరి10: ప్రమాద బీమా ప్రతి కుటుంబానికి భరోసా అని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సునీల్ కుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రాస్నం గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రమాద భీమా పథకాలు, రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ప్రజలకు ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ ప్రధాన్ మంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకం సంవత్సర కాలం పాటు వర్తిస్తుందన్నారు. ప్రీమియం మొత్తం చాలా తక్కువగా ఉంటుందన్నారు. ప్రధాన్ మంత్రి జీవన జ్యోతీ బీమా యోజన పథకం కోసం 18 నుంచి 50 సంవత్సరాల వయస్సు ఉన్నవారు రూ. 432లను చెల్లిస్తే వారికి రూ 2 లక్షల సాధారణ బీమా అందుతుందన్నారు. అనూహ్య సంఘటనలు జరిగిన పక్షంలో వారి కుటుంబానికి రూ.2 లక్షల జీవిత బీమా వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్ అధికారులు పాల్గొన్నారు.

## జడ్పీ భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

వికారాబాద్, జనవరి 10 : ఫిబ్రవరి చివరిలోగా జడ్పీ నూతన భవన నిర్మాణం పూర్తి అయ్యేలా పనుల్లో వేగం పెంచాలని జడ్పీ చైర్ పర్సన్ పట్నం సునీతారెడ్డి అధికారులకు ఆదేశించారు. బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో రూ.10 కోట్లతో నిర్మిస్తున్న జడ్పీ భవన నిర్మాణ పనులపై పీఆర్ ఇంజినీర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో మంజూరైన అంగన్వాడీ, డ్వాక్రా భవనాల నిర్మాణాలు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జడ్పీ అతిథి గృహాల నిర్మాణాలు పనుల్లో వేగం పెంచాలని, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలన్నారు. పాత ఎంపీడీవో కార్యాలయాల మరమ్మతులు కూడా పూర్తి చేయాలని ఇది వరకే సూచించామని గుర్తు చేశారు. పనుల్లో నాణ్యత పాటించకుంటే గుత్తేదారులు, అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, జడ్పీ సీఈఓ జానకీరెడ్డి, డిప్యూటీ సీఈవో సుభాషిణి, పీఆర్ ఈఈ ఉమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ శ్రీనివాస్ బాబు, డీఈఈలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్ పర్సన్ సునీతారెడ్డి

## గొంతులో చికెన్ ముక్క ఇరుక్కొని మృతి

షాద్‌నగర్, జనవరి 10: చికెన్ ముక్క గొంతులో ఇరుక్కొని ఓ వలస కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన జిత్రేందర్‌కుమార్ (40) అనే కార్మికుడు కొన్ని రోజులుగా ఎలికట్టలో నివాసం ఉంటూ స్థానిక పరిశ్రమలో ఉపాధి పొందుతున్నాడు. మంగళవారం రాత్రి ఎప్పటిలాగే చికెన్ కూరతో కలిపి పూరీలను తింటూ అకస్మాతుగా కింద పడిపోయాడు. తోటి కార్మికుడు ధర్మేందర్ విషయాన్ని గమనించి షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించాడు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. చికెన్ ముక్క ఇరుక్కొని జిత్రేందర్‌కుమార్ మృతి చెందడాని వైద్యులు తెలిపారు. జరిగిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఊరెళ్తే సమాచారం అందించాలి

వికారాబాద్, జనవరి 10 : సంక్రాంతి పండుగ సందర్భంగా ఇండ్లకు తాళాలు వేసి తమ సొంత ఊర్లకు వెళ్లే ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని వికారాబాద్ టౌన్ సీఐ శ్రీను బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో విలువైన వస్తువులు బంగారు ఆభరణాలు ఇండ్లల్లో ఉంచి వెళ్లకూడదని, ఏవైనా విలువైన వస్తువులు ఎక్కువగా ఉన్నట్లయితే బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. సొంత ఊర్లకు వెళుతున్నామని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టరాదని, సీసీ కెమెరాలు ఒకవేళ ఉన్నట్టయితే వాటిని సరిగ్గా పని చేస్తున్నాయో లేదో చెక్ చేసుకోవాలన్నారు. టూవీలర్ వాహనాలు కాంపౌండ్ లోపల ఉంచి గేట్ కి తాళం వేసుకోవాలని, ఇంటి ముందు లైట్ ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఇంటికి సంబంధించిన తాళాలు చెప్పుల స్టాండ్ లో గాని డోర్ మేట్ కింద గాని ఉంచి వెళ్లరాదని, ఒకవేళ ఇంటికి తాళం వేసి వెళ్లేటప్పుడు మీకు నమ్మకస్తులైన బంధువులకు ఇంటిపక్క వారికి తెలుపాలని వివరించారు.

## హెడ్ కుక్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలి

బొంరాస్‌పేట, జనవరి 10 : దుద్యాల మండలంలోని చెట్టుపల్లి తండా కేజీబీవీ పాఠశాలలో కాంటాక్టు పద్దతిలో నియమించే హెడ్‌కుక్ పోస్టుకు అర్హులైన మహిళా అభ్యర్థులు ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ఎస్‌వో రాధిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసున్న మహిళలు, మండలానికి చెందిన వారై, ఎక్కువ మందికి వంట చేయడంలో అనుభవం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

## గుర్తు తెలియని కారు ఢీకొని వ్యక్తి మృతి



నేనావత్ కృష్ణ (ఫైల్)

కడ్తాల్, జనవరి 10 : గుర్తు తెలియని కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం సాయంత్రం కడ్తాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ శివప్రసాద్ వివరాల ప్రకారం.. మండల పరిధిలోని రేఖ్యాతండాకు చెందిన నేనావత్ కృష్ణ (45) కొన్నేండ్లుగా కడ్తాల్ గ్రామంలో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. సాయంత్రం కృష్ణ వ్యక్తిగత పనులు పూర్తి చేసుకొని హైదరాబాద్–శ్రీశైలం ప్రధాన రహదారిపై నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నాడు. అదే సమయంలో కల్వకుర్తి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని కారు కృష్ణను ఢీకొట్టింది. అదే క్రమంలో మరో వాహనాన్ని ఢీకొట్టిన డ్రైవర్ కారుతో సహ పరారయ్యాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలను సేకరించారు. మృతుడి భార్య సోని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## ఉపకార వేతనాలకు దరఖాస్తులు చేసుకోవాలి

వికారాబాద్, జనవరి 10 : 2022–23 విద్యాసంవత్సరంలో ఉత్తీర్ణులైన వారికి ప్రతిభ ఆధారంగా ఉపకార వేతనాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు కార్మిక శాఖ సహాయ కమిషనర్ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి కింద అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో భాగంగా దుకాణాలు, వాణిజ్య సంస్థలు, కర్మాగారములు, మోటారు రవాణా సంస్థలు, సహకార సంస్థలు ధార్మిక, ఇతర ట్రస్టులలో పని చేస్తున్న కార్మికుల పిల్లలు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. కోర్సులలోదరఖాస్తు ఫారములు సంబంధిత, సహాయ కార్మిక కమిషనర్ కార్యాలయములో పొందాలన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులు ఫిబ్రవరి 15 లోపు సంబంధిత కార్మిక శాఖ కార్యాలయాల్లో సమర్పించాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న, గడువు తరువాత సమర్పించిన దరఖాస్తులు తిరస్కరిస్తామని పేర్కొన్నారు. ఎంపిక అయిన అభ్యర్థులకు ఉపకారవేతనాలను సంబంధిత సహాయ కమిషనర్లు మేడే నాటికి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో జమ చేస్తారని తెలిపారు.

## ఘనంగా లూయిస్ బ్రెయిలీ జన్మదిన వేడుకలు




అంధులతో కలిసి కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్, జనవరి 10 : డాక్టర్ లూయిస్ బ్రెయిలీ 215వ జన్మదిన వేడుకలను బుధవారం అంబేద్కర్ భవనంలో అంధులు ఘనంగా జరుపుకున్నారు. విజువల్లీ చాలెంజ్‌డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల హాజరై బ్రెయిలీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

## హక్కులపై అవగాహన కలిగి ఉండాలి

వికారాబాద్, జనవరి 10 : మహిళలు, బాలలు హక్కులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని వికారాబాద్ మహిళా సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ ఎస్. బలరాం తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారత కేంద్రం ద్వారా భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించి బాలికలందరికీ అవగాహన కల్పించారు. కేజీబీవీ వైస్ ప్రిన్సిపాల్ సబిహ సుల్తానా మహిళా సాధికారత కేంద్రం వరలక్ష్మి, బాబు, రాందాస్ పాల్గొన్నారు.